సాక్షి
నాగర్‌కర్నూల్

శనివారం । 11 । మార్చి । 2023



అనుమతి లేకుండానే..

కొందరు రైతులు అనుమతి లేకుండా నర్సరీలు నిర్వహిస్తూ నష్టపోతున్నారు.

వివరాలు 8లో ▸



న్యాక్ సందర్శనకు ముస్తాబు

జడ్చర్లలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సందర్శించనుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం

34.0 /19.3

వాతావరణం

మధ్యాహ్నం తీవ్ర ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి కొద్దిమేర చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

13న 'ప్రజావాణి' రద్దు

నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న నిర్వహించనున్న నేపథ్యంలో అదే రోజు నిర్వహించాల్సిన ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు, ప్రజలు గమనించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణలో జిల్లా యంత్రాంగం, అధికారులు అందరూ నిమగ్నమై ఉంటారని దీంతో కలెక్టరేట్‌లో 13వ తేదీ నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు, ప్రజలు ఎవరూ కూడా సమస్యలపై ఫిర్యాదులు అందజేసేందుకు రావద్దని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, మకు ఉన్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సబిత మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే సరైన న్యాయం పొందవచ్చని తెలిపారు. పోక్సో, భరణం, ఆస్తిహక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్.. సీనియర్ సివిల్‌జడ్జి, మహిళా వైద్యులు, న్యాయ అధికారినిలకు సన్మానం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకట్ దాస్ , డీపీఓ రేనయ్య, రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేష్ రెడ్డి, డి.కుమార్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్)లో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. వృక్ష శాస్త్రం సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన వారి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్సీ బాటని పూర్తిచేసి, కనిష్టంగా 55శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 14వ తేదీ సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొబ్బరికాయల వేలం రూ.11.11లక్షలు

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి సంబంధించి కొబ్బరికాయల వేలం నిర్వహించగా..రూ.11.11లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ చైర్మన్, పాలకవర్గం సమక్షంలో కొబ్బరికాయలు విక్రయానికి, తలనీలాలు, కొబ్బరి చిప్పలకు సంబంధించి వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయల వేలాన్ని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన నవీన్ రూ.11.11లక్షలకు దక్కించుకున్నారు. అచ్చంపేటకు చెందిన నర్సింహ రూ.1.15లక్షలకు తలనీలాలు, చిన్నచింతకుంటకు చెందిన అంజన్న రూ.60 వేలకు కొబ్బరి చిప్పల వేలాన్ని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈఓ రఘు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు వీణధరి, అలయ మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

కందనూలు: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ జి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అధికారులకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,112మంది, ద్వితీయ పరీక్షలకు 6191మంది విద్యార్థులు హాజరవుతారని, మొత్తం 31పరీక్షా కేంద్రాలను రెండు సిట్టింగ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం తనిఖీలు చేస్తాయన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించబడునని, నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి ఉండదని వెంకటరమణ అన్నారు.



పోటాపోటీ..

రసవత్తరంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు



- నేటితో ముగియనున్న ప్రచారపర్వం
- ఆత్మీయ సమావేశాలతో జోరు పెంచిన అభ్యర్థులు
- విందు భేటీలతో మచ్చిక.. తాయిలాల ఎర
- 13న పోలింగ్.. 16న ఓట్ల లెక్కింపు
- ఉమ్మడి పాలమూరులో 8,190 మంది టీచర్లు
- మొత్తం 52 పోలింగ్ కేంద్రాలు.. ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కల్వకుర్తిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు సమీపిస్తుండడంతో అభ్యర్థులు దూకుడు పెంచారు. ఈ నెల 13న పోలింగ్ జరగనుండగా.. శనివారం సాయంత్రంతో ప్రచారపర్వం ముగియనుంది. ఈనేపథ్యంలో బరిలో నిలిచిన వారు టీచర్లను ఆకట్టుకునేందుకు తమదైన శైలిలో అస్త్రాలు సంధిస్తున్నారు. కొన్ని నెలలుగా బడిబాటతో పాటు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించగా.. తాజాగా ఆత్మీయ సమావేశాలు, విందు భేటీలతో తాయిలాలు ఎరవేస్తూ విజయమే లక్ష్యంగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా.. ప్రధాన రాజకీయ పార్టీలు తమకు మద్దతుగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలతో కలిసి మద్దతుదారుల విజయానికి శ్రమిస్తుండడంతో పోరు రసవత్తరంగా మారింది.

బరిలో 21 మంది అభ్యర్థులు

హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో మొత్తం 21 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇందులో 20 మంది స్వతంత్రులు కాగా.. ఒకరు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ తరఫున పోటీ చేసిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డి ఈసారి పీఆర్టీయూ తెలంగాణ మద్దతుతో పోటీలో ఉన్నారు. పీఆర్టీయూ టీఎస్ తరఫున గుర్రం చెన్న కేశవరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ తరఫున పి.మాణిక్‌రెడ్డి, ఎస్టీయూ టీఎస్ మద్దతుతో బి.భుజంగరావు, బీజేపీ తరఫున ఏవీఎన్ రెడ్డి, కాంగ్రెస్ మద్దతుతో హర్షవర్ధన్‌రెడ్డి, టీపీటీఎఫ్ మద్దతుతో వినయ్‌బాబు, బీసీటీఏ మద్దతుతో విజయ్‌కుమార్, టీఎస్ టీసీఈఏ మద్దతుతో ఎ.సంతోష్‌కుమార్, టీయూటీఎఫ్ తరఫున మల్లారెడ్డి, జీటీఏ నుంచి కాసం ప్రభాకర్‌తో సహా 21 మంది పోటీ పడుతున్నారు.

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఓటర్లు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	15	1,580	1,881	3,461
నాగర్‌కర్నూల్	14	664	1,189	1,853
జోగుళాంబ గద్వాల	11	315	562	877
వనపర్తి	07	474	861	1,335
నారాయణపేట	05	240	424	664
మొత్తం	52	3,273	4,917	8,190



ఆ నలుగురి మధ్యే ప్రధాన పోటీ..

హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి **జిల్లాల ఉపాధ్యాయ** ఎమ్మెల్సీ స్థానానికి **2017లో 12** మంది పోటీపడ్డారు. ఇం**దులో కాటేపల్లి** జనార్దన్‌రెడ్డి రెండో **పర్యాయం గెలు**పొందగా.. మాణిక్‌రెడ్డి రెం**డు, ఏవీఎన్** రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం 21మంది బరిలో ఉన్నా.. ప్రధానంగా పి.మాణిక్‌రెడ్డి (టీఎస్ యూటీఎఫ్), చెన్నకేశవరెడ్డి (పీఆర్టీయూ టీఎస్), తాజా, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి (టీపీఆర్టీయూ), ఏవీఎన్ రెడ్డి (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) మధ్య పోటీ ఉండనున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

ఉమ్మడి పాలమూరులో 8,296 మంది..

ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గస్థానానికి సంబంధించి మొత్తం 29,720మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో అంతా కలిపి 8,190మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 52 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 13న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా.. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

జిల్లాకేంద్రాలపైనే అభ్యర్థుల నజర్..

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 3,461 మంది.. నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 664 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆయా జిల్లా కేంద్రాల్లోనే ఓటర్లు అధికంగా ఉండగా.. ఆయా ప్రాంతాలపైనే అభ్యర్థులు ప్రధానంగా దృష్టి సారించి ప్రచారం నిర్వహిస్తున్నారు.

- మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 3,461 మంది ఓటర్లు ఉండగా.. ఒక్క మహబూబ్‌నగర్ అర్బన్‌లోనే 2,572 మంది ఉన్నారు. ఆ తర్వాత జడ్చర్ల మండలంలో 427 మంది ఉన్నారు.
- వనపర్తి జిల్లాలో 1,335 మంది ఓటర్లు న్నారు. వనపర్తి మండలంతో పాటు గోపాల్‌పేట, పాన్‌గల్, రేవల్లి, పెద్దమందడి మండలాలకు కలిపి వనపర్తిలో రెండు పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల పరిధిలో 635 మంది ఓటర్లు ఉన్నారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 877 మంది ఓటర్లు ఉండగా.. ఒక్క గద్వాల మండలంలోనే 482 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 1,853 మంది. నాగర్‌కర్నూల్ మండల పరిధిలో 427, అచ్చంపేటలో 329, కల్వకుర్తిలో 311 మంది ఓటర్లు ఉన్నారు.
- నారాయణపేట జిల్లాలో మొత్తం 664 ఓటర్లు ఉన్నారు. నారాయణపేట, దామరగిద్ద, ఊట్కూర్ మండలాలకు కలిపి పేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. దీని పరిధిలో 345 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పాలమూరుపై బీజేపీ ఫోకస్..

ఏవీఎన్ రెడ్డి గెలుపు కోసం బీజేపీకి చెందిన ముఖ్యనేతలు పాలమూరుపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టారు. మహబూబ్‌నగర్‌లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. నారాయణపేటలో గురువారం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొన్నారు. తాజాగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరై ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరడాన్ని బట్టి పాలమూరుపై వారు సీరియస్‌గా నజర్ పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

నాగర్‌కర్నూల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నియమించబడిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రోఅబ్జర్వర్లు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ ఆదేశించారు. మహబూబ్‌నగర్ –రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పీఓ, ఏపీఓలు బ్యాలెట్ ద్వారా నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, ఇందుకుగాను ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను క్షుణ్ణంగా చదవాలని ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారులపై ఎక్కువ బాధ్యత ఉన్నప్పటికీ, సహాయ ప్రిసైడింగ్ అధికారి సైతం అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా కారణం చేత ప్రిసైడింగ్ అధికారి ఎన్నికలు నిర్వహించలేనప్పుడు సహాయ ప్రిసైడింగ్ అధికారి కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులన్నీ కల్పించినట్లు, జిల్లాలో 14 పోలింగ్ స్టేషన్లు, 1,822 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

12న సామగ్రి అందజేత..

ఈ నెల 12న నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎన్నికల సామగ్రిని అందజేయడం జరుగుతుందని, అదేవిధంగా ఎన్నికల అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో బందోబస్తు మధ్య హైదరాబాద్ తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ నిర్వహణ మొత్తం వీడియో స్ట్రీమింగ్ అవుతుందని, మైక్రోఅబ్జర్వర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్స్ రాజశేఖర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ రవి కిరణ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.

సావిత్రిబాయి ఫూలే సేవలు మరువలేనివి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులకు సావిత్రిబాయి పూలే మార్గదర్శకురాలని.. ఆమె సేవలు మరువలేనివని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని మహిళా ఉద్యోగస్తులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ ఇంట్లో అయితే మహిళ విద్యావంతురాలు అవుతుందో, ఆ ఇంట్లో తర్వాతి తరం మొత్తం విద్యావంతులు అవుతారని, కుటుంబం ఉన్నతస్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ ఉద్దేశంతోనే జ్యోతిబాపూలే తన భార్య సావిత్రిబాయి పూలేను మొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారన్నారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని అమ్మాయిల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూర్య చైతన్య, శైలజ, మౌనిక, ప్రేమలత, నాగేందర్, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

అచ్చంపేట రూరల్: పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఆ దిశగా చదవాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్‌ను ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి రాంలాల్‌తో కలిసి పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో అందుతున్న వసతులు, విద్య గూర్చి ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సీఎం రెడ్డి, సిబ్బంది మన్సూర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మనోహర్

ఉప్పునుంతల: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకునేలా చూడాలని, వీటి వల్ల నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మండలంలో శాంతి భద్రతలు, పెట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్ఐ శేఖర్‌గౌడ్‌తో ఆరా తీశారు. మండలంలో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, శ్రీశైలం–హైదరాబాద్‌లో రహదారిపై నిత్యం పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ఆయనతోపాటు ఏఆర్ ఏఎస్పీ భరత్ ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కందనూలు: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆంగ్ల పదజాల పోటీల్లో స్థానిక సీఎస్‌ఆర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చగా ఎస్పీ మనోహర్ వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు మేధశ్రీ ప్రథమ, సుమేర ద్వితీయ, సుమేగా తృతీయ స్థానంలో నిలవగా వారిని అభినందించారు. పాఠశాల ఫౌండర్ సి.భాస్కర్‌రావు, ప్రిన్సిపాల్ కవిత, యాజమాన్యం ఫసియొద్దీన్, వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయబృందం... విద్యార్థులను అభినందించారు.

వైద్య సేవలపై 'లక్ష్యా' బృందం ఆరా

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారు, ఇంకా మరిన్ని సేవలు అందించడానికి ఎలా కృషిచేయాలన్న వాటిపై ఏర్పాటు చేసిన లక్ష్యా బృందం పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కుల్వీందర్ సింగ్, కేరళకు చెందిన అంజెలా జ్ఞానదురై ఆసుపత్రిలోని అన్ని విభాగాలను తిరిగి, రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఎక్స్‌రే విభాగాలు, వాటి పని తీరు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. వైద్యులు శివరాం, స్వర్ణలత, పాండురంగా, సందీప్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పట్టని పాలకులు

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిని మాత్రం ఇక్కడి పాలకులు విస్మరించారని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేఎల్‌ఐ పథకం ఇప్పటికీ పూర్తికాలేదని, నిర్వాసితులకు పరిహారం అందలేదని, వెల్దండ మండలం బోకారంలో నీరు నిల్వ చేసే పెద్ద చెరువును ధ్వంసం చేయడంతో మత్స్యకారుల జీవితం అగమ్యగోచరంగా మారిందన్నారు. పార్టీ బలంగా ఉన్నా ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం గళమెత్తుతానని, ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సీఎం హామీ ఇచ్చినా కూడా కల్వకుర్తి, ఆమనగల్ ఆస్పత్రులను వంద పడకలుగా మార్చకపోవడం ఇక్కడి నాయకుల అసమర్థతేనని దుయ్యబట్టారు. త్వరలో అభివృద్ధిని కాంక్షించే ముఖ్యులతో సమావేశమై అభివృద్ధి కోసం రోడ్డు మ్యాప్ తయారు చేస్తామని అన్నారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అంజయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీశైలం, జహీర్ పాల్గొన్నారు.

పునరేకీక'రణం'..!

వనపర్తిలో మారుతున్న రాజకీయ సమీకరణలు

- బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్‌లోనూ అసమ్మతి సెగలు
- వనపర్తి, పెబ్బేరులో రాజీనామాకు సిద్ధమైన 'హస్తం' కౌన్సిలర్లు
- ఐక్యతా దిశగా ఇరు పార్టీల్లోని అసంతృప్త నేతలు
- మంత్రి ఓటమే ఏకైక లక్ష్యంగా కార్యాచరణ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వనపర్తి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. అధికార పార్టీ భారత రాష్ట్ర సమితిలో అసమ్మతి సెగలు భగ్గుమనగా.. మంత్రికి అత్యంత సన్నిహితులుగా ఉన్న ముఖ్య నాయకులు తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డితో పాటు 11 మంది సర్పంచ్‌లు, సింగిల్ విండో డైరెక్టర్, మాజీ చైర్మన్, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉప సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వారు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి.. రోజు గడవక ముందే కాంగ్రెస్‌లో సైతం అసమ్మతి స్వరం కట్టలు తెంచుకుంది. మాజీ మంత్రి, ఏఐసీసీ నేత చిన్నారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి చెందిన వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పలువురు కౌన్సిలర్లు రాజీనామాకు సిద్ధమయ్యారు. ఒకేరోజు బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో వరుసగా చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆయా పార్టీల్లో కలకలం రేపుతున్నాయి. పునరేకీకరణే లక్ష్యంగా ఇరు పార్టీల్లోని అసమ్మతి నేతలు ఐక్యతతో పావులు కదుపుతుండడం ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనేతలను ఉక్కిరిబిక్కిరికి గురి చేస్తుండగా.. శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

ఎటువైపు మొగ్గు చూపుతారో..

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నేతలు ఏ పార్టీలో చేరతారనే చర్చ జిల్లాలో జోరుగా నడుస్తోంది. బీజేపీతో పాటు కాంగ్రెస్ నేతలు వారితో టచ్‌లో ఉన్నారని.. ఎక్కువ మంది 'చేతి'వైపే మొగ్గు చూపుతున్నారని.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కూడా దొరికిందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఏ పార్టీలో చేరాలనేది ఇంకా నిర్ణయించలేదని.. నియోజకవర్గంలో ప్రజలు, అభిమానులు, మద్దతుదారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని.. ఆ తర్వాతే తగిన నిర్ణయం తీసుకుంటామని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి స్పష్టం చేశారు. కానీ..వారు అంతర్గతంగా పార్టీలకతీతంగా ఏకం చేసి వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించకోవాలనే లక్ష్యంతో ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.



'రావుల' చుట్టే రాజకీయం..

మంత్రి నిరంజన్‌రెడ్డిపై తిరుగుబావుటా ఎగురవేసిన నాయకులు గతంలో టీడీపీ, కాంగ్రెస్‌లో పనిచేసిన వారే. మంత్రి నిరంజన్‌రెడ్డి ఓటమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న వారు పునరేకీకరణతోనే ఇది సాధ్యమవుతుందని భావించి.. అందుకనుగుణంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్‌లో ప్రస్తుత నేతపై పార్టీలో అసమ్మతి ఉండడం.. తెలంగాణలో ప్రాబల్యం కోల్పోయిన టీడీపీ నుంచి గెలవడం సాధ్యం కాదని భావించిన అసమ్మతి నేతలు తెరవెనుక మెల్లమెల్లగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. చిన్నారెడ్డిని బుజ్జగించి, 'రావుల'ను హస్తం గూటికి తీసుకొచ్చి పోటీ చేయించడం.. లేకుంటే ఐక్యతగా తమలో ఒకరు ఏదైనా పార్టీ నుంచి బరిలో నిలవడమే లక్ష్యంగా అన్నీ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ అసమ్మతి నేతల రాజీనామాలు.. ఆ తర్వాత పరిణామాల క్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. శుక్రవారం వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ ఓ మాజీ ఎమ్మెల్యే డైరెక్షన్‌లో ఆడిన నాటకమే జెడ్పీ చైర్మన్, ఎంపీపీలు, సర్పంచుల రాజీనామాల వ్యవహారమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో అవినీతి, అరాచకాలు, నియంతృత్వానికి విసిగి ఆత్మాభిమానంతో బయటికి వస్తే మాపై ఏడుస్తారా.. రావుల ప్రభావితం చేస్తే లొంగిపోయేంత బలహీనంగా ఉందా మీ పార్టీ.. పార్టీలు మారడం, ప్రలోభాలకు లొంగడం రావుల రక్తంలో లేదు.. మీ అంతర్గత కలహాల్లో రావులను లాగితే ఖబడ్దార్.. అంటూ టీడీపీ నేతలు సామాజిక మాధ్యమాల్లో కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో పలు పోస్టులు వైరల్‌గా మారాయి.

సైలెంట్ వెనక కారణమేంటో..

ఈ పార్టీలో చేరుతున్నారు.. ఆ పార్టీలో చేరుతున్నారనేవి ఊహాగానాలేనని కొట్టిపారేస్తున్న బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన అసమ్మతి నేతలు కొన్నాళ్ల క్రితం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత చిన్నారెడ్డితో వేర్వేరుగా భేటీ అయినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతోపాటు కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన వనపర్తి, పెబ్బేరు కౌన్సిలర్లు తెల్లారేసరికే స్తబ్దుగా ఉండడంతో అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పార్టీ అధిష్టానం ఎవరు పోటీ చేస్తారనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు.. అందుకే వారు మిన్నకుండిపోయినట్లు చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

13న విద్యా సంస్థలకు సెలవు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 13వ తేదీన జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పాఠశాలలు, కళాశాలలకు మాత్రమే సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ రవినాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే ముందు రోజు, పోలింగ్ రోజు సెలవు ప్రకటించాలని సూచించారు. 12వ తేదీన ఆదివారం సెలవు కావడంతో ఆరోజు ఎలాంటి స్థానిక సెలవు అవసరం లేదని పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఈడిగోనిపల్లికి చెందిన మల్లేష్ (19) శుక్రవారం ఉదయం యాజమాని కుర్వరాముడుతో కలిసి గొర్రెలను చెరువు సమీపం వద్దకు తీసుకెళ్లారు. గొర్రెలు నీళ్లు తాగుతుండగా, అందులో కొన్ని నీళ్లలో నుంచి బయటకు రాలేక చిక్కుకున్నాయి. వాటిని బయటకు తీసుకువచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు మల్లేష్ నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. కాపాడేందుకు యజమాని ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలి తం లేకపోయింది. స్థానికుల సాయంతో బయటకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చిన్న గోవిందు, మాణిక్యమ్మ అక్కడికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో కారోబార్ మృతి

హన్వాడ: మండలంలోని కొత్తపేట పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్ కోమటి కేశవులు యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేశవులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెంచు మహిళపై లైంగికదాడి

మన్ననూర్: చెంచు మహిళపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చినట్లు ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపారు. బల్మూర్ మండలానికి చెందిన ఓ వివాహిత మూడు నెలల క్రితం పదర మండలంలోని ఓ గ్రామంలో తన అక్క ఇంటికి వచ్చి అక్కడే ఉంటుంది. ఈ క్రమంలో 8వ తేదీన సొంత పని నిమిత్తం అక్క హైదరాబాద్‌కు వెళ్లడంతో ఈమె ఇంట్లో ఉన్నది. గమనించిన సమీప కుటుంబానికి చెందిన లాలు ఆమెకు మద్యం తాగించి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ అనారోగ్యం కారణంగా సంఘటన అయిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయలేకపోయిందని తెలిపారు. శుక్రవారం బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోకు నిప్పు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కటికే నర్‌సోజీ ఐదు నెలల క్రితం ఆటోను కొనుగోలు చేశారు. ఈ క్రమంలో రాత్రి ఇంటి వద్ద ఆపగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

తైబజార్ కాంట్రాక్టర్‌తో వ్యాపారుల వాగ్వాదం

బాలానగర్: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంతలో నిర్ణయించిన ధరల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా తైబజార్ వసూలు చేస్తున్నారని వ్యాపారస్తులు కాంట్రాక్టర్‌తో శుక్రవారం వాగ్వాదం దిగారు. గత నెలలో ఇదే విషయమై పంచాయతీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ నెల మొదటి శుక్రవారం సంత బజారులో నిర్ణయించిన ధరల కంటే అధిక వసూళ్లకు పాల్పడితే పంచాయతీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కాగా శుక్రవారం కూరగాయాలు అమ్మే వ్యక్తి వద్ద రూ.20కి బదులు రూ.50, చేపలు అమ్మే వారి వద్ద నుంచి రూ.60కి గాను రూ.150, ఆటో వారి నుంచి రూ.20కి గాను రూ.50 వసూలు చేస్తున్నారని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసుల సమక్షంలో విచారణ చేయగా 18 నెల లుగా మాత్రమే వసూలు చేస్తున్నట్లు కాంట్రాక్టర్ జగ దీష్ ఒప్పుకున్నాడు. పోలీసులు చిరువ్యాపారు ల ఫిర్యాదుతో ఆయనను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కార్యదర్శి జగన్‌ను వివరణ కోరగా.. చిరు వ్యాపారుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న తైబజార్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



అనుమతి లేకుండానే నర్సరీలు



జడ్చర్ల సమీపంలో నిర్వహిస్తున్న నర్సరీ

- ఊసేలేని రికార్డుల నిర్వహణ
- నాసిరకం నారుతో రైతులకు ఇబ్బందులు

జడ్చర్ల: సంప్రదాయ పంటల నష్టాల నుంచి ఇప్పుడిప్పుడే వాణిజ్య, ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపుతున్న రైతులకు అనుమతి లేని ఉద్యాన నర్సరీలు గుదిబండగా మారాయి. నాసిరకం నారు అంటగట్టి రైతులను మరింత నష్టాల ఊబిలోకి నెడుతున్నారు. రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో నర్సరీ యజమానులు చెప్పే మాటలే వారికి వేదమవుతున్నాయి. ఫలితంగా యజమానులకు సిరులు కురిపిస్తుండగా రైతులకు మాత్రం నష్టాలు, కష్టాలు మిగులుతున్నాయి. నియోజకవర్గంలో టమాట, మిరప, వంకాయ, ఉల్లి, ఇతర నారును నర్సరీల్లో పెంచుతున్నారు.

నిబంధనలు ఇవే..

ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలు విక్రయించే విత్తనాలను నర్సరీల యజమానులు కొనుగోలు చేసి నారు పోయాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన కంపెనీ, లాట్‌నంబర్, బిల్లులు తీసుకోవాలి. రైతులకు నారు విక్రయించే ముందు రైతు పేరు, గ్రామం, కొనుగోలు చేసిన నారు రకం, ధరతో పాటు రికార్డుల్లో నమోదు చేసి విధిగా బిల్లు అందించాలి. నాసిరకం నారు కారణంగా పంట దిగుబడి రాకపోతే ఆ బిల్లు ఆధారంగా కంపెనీ యాజమాన్యంతో నష్టపోయిన రైతుకు పరిహారం కోరే వీలుంటుంది. అదేవిధంగా నర్సరీ ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేసి మొక్కలు, ధరలు తెలుగులో రాసిపెట్టాలి. జడ్చర్ల, బాలానగర్ ప్రాంతాలలో నర్సరీ యజమానులు ఇలాంటి నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. సీజన్‌లో టమాట, మిరప, వంకాయ, ఇతర నారు ఒక్కో మొక్క రూ.60 పైసల నుంచి రూపాయి వరకు విక్రయిస్తున్నారు.

కావాల్సిన అర్హతలు

నర్సరీ ఏర్పాటు చేసుకునే ముందు యజమాని ఉద్యాన శాఖకు చిరునామా, సొంత భూమి లేదా అధికారిక లీజు భూమి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం వ్యవసాయాధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. మట్టి, నీరు, గాలి, వెలుతురు సక్రమంగా ఉందా లేదా అంశాలపై నివేదిక తయారు చేస్తారు. పరిశీలించి ఉద్యానవన శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. నర్సరీ చట్టం ప్రకారంగా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

మిరప దిగుడి రాలే..



నర్సరీలలో పోసిన మిరప నారును కొనుగోలు చేసి సాగు చేశాను. కానీ నిర్వాహకులు చెప్పిన విధంగా దిగుబడి రాలేదు. సాగు వ్యయం పెరిగింది కానీ దిగుబడి రాకపోవడంతో నష్టపోయాం. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఎలాంటి బిల్లులు ఇవ్వకపోవడంతో నష్టపరిహారం కోరే పరిస్థితి లేకుండా పోయింది.

– వెంకట్‌రెడ్డి, రైతు, మున్ననూరు

అనుమతులు లేవు

జడ్చర్ల, బాలానగర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసుకున్న నర్సరీలకు ఎలాంటి అనుమతులు లేవు. గతంలో అనుమతులు ఉన్నా మళ్లీ రెన్యూవల్ చేసుకోవడం లేదు. ఇప్పటికే నర్సరీల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకుంటాం.

–హిమబిందు, ఉద్యానవన శాఖ అధికారి, జడ్చర్ల



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

మీ తీర్పు కోసం రాష్ట్రం ఎదురుచూస్తోంది

- ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్



హాజరైన ఉపాధ్యాయులు

పాలమూరు: ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా బీజేపీ అభ్యర్థి గెలుపొందుతాడనే చెబుతున్నాయని, ఉపాధ్యాయులు ఆలోచించి తీర్పు ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబానికి మరింత అహంకారం పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు ఇవ్వలేదని, పీఆర్‌సీతోపాటు పదోన్నతుల కల్పించకపోవడంతో సంగం మంది పదోన్నతులు లేకుండానే విశ్రాంతి పొందుతున్నారని విమర్శించారు. ప్రతి నెల 1న జీతాలు వస్తున్నాయి అనుకుంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని, రావడం లేదని భావిస్తే బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఉపాధ్యాయులు ఓటు వేయాలని చెప్పడానికి టీఎన్జీఓ నాయకులు ఎవరని, వారంతా కేసీఆర్ మోచేతి నీళ్లు తాగుతున్నారని దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్– చించోళి రోడ్డుకు కేంద్రం నిధులు కేటాయిస్తే ఇక్కడి మంత్రి కొబ్బరికాయ కొట్టాడన్నారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న రూ.5 లక్షల కోట్లకు అదనంగా మరో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తారని ఆరోపించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి 2 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే ఏ ఒక్కటీ పేదలకు ఇవ్వలేదన్నారు. పంజాబ్ రైతులకు కేసీఆర్ ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని, ఎక్కడైనా సీఎం ఇచ్చిన చెక్కులు బౌన్స్ అవుతాయా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే డీఏ, బదిలీలు, ప్రమోషన్ల వంటి సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లకు న్యాయం చేస్తామన్నారు. టీచర్లు ఇచ్చే తీర్పుపైనే తెలంగాణ ప్రజల భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించి, నియంత పోకడలకు చరమగీతం పాడాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మీ తరఫున నిరంతరం గళం విప్పే అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డిని నిలిబెట్టామని, ఆయనకే ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, మాజీమంత్రి పి.చంద్రశేఖర్, పార్లమెంట్ కన్వీనర్ డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాగూరావు నామాజీ, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు సునీల్ పాల్గొన్నారు.

జల్సాల కోసం వాహనాల చోరీ

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తకోట: పట్టణంలో వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన గంగాధర్ ఫిబ్రవరి 28న ద్విచక్రవాహనంపై వస్తుండగా కొత్తకోట చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో గంగాధర్ పారిపోయేందుకు ప్రత్నించాడు. అనుమానం రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకోని విచారణ చేయగా పెబ్రేరులో బుల్లెట్ వాహనం చోరీ చేసి నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్నాని ఒప్పుకున్నాడు. గతంలో 2004 నుంచి 2016 వరకు ఆయిల్ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహించగా అందులో నష్టాలు రావడంతో 2010 నుంచి చోరీలు చేయడం ప్రారంభించాడు. కర్నూలు జిల్లాలో ఉంటూ ఒంటరిగా పార్కింగ్ చేసిన లారీలను మాస్టర్ కీ ఉపయోగించి డీజిల్ దొంగతనం చేయడంతో పాటు అక్కడక్కడ లారీలను ఎత్తుకెళ్లి హైదరాబాద్‌లో అమ్ముకుని వచ్చిన నగదుతో జల్సాలు చేసేవాడు. సిమెంట్ లారీ, ట్యాంకర్‌ను చోరీపై నంద్యాల, తాడిపర్తిలో కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం ద్విచక్రవాహనం చోరీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైర్లను చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

ఎర్రవల్లిచౌరస్తా: వ్యవసాయ మోటార్ వైర్లను చోరీ చేస్తున్న వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్ఐ గోకారి తెలిపారు. మండలంలోని మొగిలిరావుల చెర్వు చెందిన సురేష్ చుట్టుపక్కల గ్రామాలలోని రైతుల పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్ వైర్లను రాత్రివేళల్లో దొంగిలించి విక్రయించేవాడు. ఈ క్రమంలో అతడిని అదుపులోకి తీసుకుని శుక్రవారం అలంపూర్ కోర్టులో హాజరుపరిచి, మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లొస్తుండగా..

వాహనం ఢీకొని యువకుడు మృతి



అరుణ్‌కుమార్(ఫైల్)

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ చౌరస్తాలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన రామోజీ అరుణ్‌కుమార్(25) స్కూటీపై గురువారం రాత్రి మండలంలోని కేస్లీతండాలో స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లి, తిరిగి అదే రాత్రి వస్తుండగా కొట్రగేట్ చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడడంతో గమనించిన తండావాసులు పోలీసులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఏఆర్ డీఎస్పీ మృతి



బాల్‌రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వై.బాల్‌రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయన కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్పీ మనోహర్, ఏఎస్పీ రామేశ్వర్ ఆస్పత్రి వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. ఈయన మూడు నెలల క్రితమే హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చి ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

గోవా మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ పోలీసులు

మాగనూర్ (కృష్ణ): గోవా నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో గోవా నుంచి తీసుకువస్తున్న 38 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న కూర రఘోత్తంరెడ్డి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కార్పొరేట్ శక్తులు మండలి ఎన్నికల బరిలో నిలిచాయని, వాటి మాయలోనుంచి బయటపడి విద్యారంగ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ పక్షాన ఉపాధ్యాయులు నిలవాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి పీఆర్‌టీయూ టీఎస్ నిర్వహించిన టీచర్ల ఆత్మీయ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే ఏ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘానికి లేనంత సభ్యత్వం పీఆర్‌టీయూకి ఉందని, రాష్ట్రంలో బలమైన సంఘంగా ఆవిర్భవించి ఏ ప్రభుత్వం ఉంటే వారితో కలిసి పనిచేస్తూ టీచర్ల సమస్యలకు పరిష్కారం చూయించిన ఘనత దక్కిందన్నారు. రాష్ట్రంలో బడులు, టీచర్లు, పిల్లలకు ఉపయోగకరమైన జీఓలన్నీ తమ సంఘం తీసుకుని వచ్చినవేనని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు మోకాలడ్డు వేశారన్నారు. పాఠశాలలకు ఉచిత కరెంటు ఇవ్వాలని కోరగా, మరో మూడు నెలల్లో సోలార్ విద్యుత్‌తో బడులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తామని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో చేశామని, భవిష్యత్‌లో కొనసాగిస్తామన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.వెయ్యికోట్లకు అదనంగా రూ.200కోట్లు ఇప్పిస్తూ తమ జీతంలో ఒక శాతం అందించి ప్రతి ఉపాధ్యాయ కుటుంబానికి ఓపీ నుంచి ఆపరేషన్ల వరకు ఉచితంగా అందించేందుకు కృషిచేస్తున్నామని, ఏప్రిల్ 1 నుంచి అమలు అయ్యేలా చూస్తామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో కలుగుతున్న ఇబ్బందులను అధిగమించి బాండ్ లేకపోయినా వారికి రెగ్యులర్ చేయించే బాధ్యత తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ సారి 28 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తున్నామని, జులై నుంచే అమలుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పదవీవిరమణ పొందిన టీచర్ స్థానంలో పక్క జిల్లాలో ఉన్న వారిని సొంత జిల్లాకు తీసుకుని వస్తామన్నారు. వివిధ సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రాలు అందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రకాష్, శంకర్, నారాయణరెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి

పాలమూరు: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. హన్వాడ మండలంలోని లింగన్నపల్లికి చెందిన కృష్ణవేణికి మూడు రోజుల కిందట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రసవం అయ్యింది. అయితే నవజాత శిశువు ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఆవరణలో కొద్ది సమయం ఆందోళన చేపట్టగా వైద్యులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

న్యాక్ సందర్శనకు ముస్తాబు



జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- ఏ++ గ్రేడ్ కోసం సన్నాహాలు
- అందుబాటులోకి ఇండోర్ స్టేడియం
- పూర్వ విద్యార్థులతో సమావేశం



అందుబాటులోకి వచ్చిన ఇండోర్ స్టేడియం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ బృందం సందర్శనకు ముస్తాబైంది. ఈనెల 15, 16 తేదీల్లో యూజీసీకి చెందిన బృందం కళాశాలను సందర్శించనుంది. ఈ మేరకు కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఐదేళ్లకోమారు కళాశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, వసతులు, బోధన పరిశీలన చేసేందుకు యూజీసీ నుంచి ఓ బృందం డిగ్రీ కళాశాలలను సందర్శించనుంది. అనంతరం కళాశాలకు న్యాక్ గ్రేడ్‌లను కేటాయిస్తుంది. కేటాయించిన గ్రేడ్‌ల ఆధారంగా నిధుల కేటాయింపు, కళాశాలకు స్వయంప్రతిపత్తి లభిస్తాయి. ఆరేళ్ల క్రితం న్యాక్ బృందం కళాశాలను సందర్శించి బీడబుల్ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించింది. దాంతో కళాశాలకు కొంత నిధులు పెరిగాయి. న్యాక్‌బృందం సందర్శించటం ఒక ఏడాది ఆలస్యం అయ్యింది. న్యాక్ బృందం సందర్శన కోసం గత ఏడాది యూజీసీ కళాశాలకు సంబంధించి ఏడు అంశాల్లోనూ డాటా వెరిఫికేషన్ వాల్యుయేషన్ నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించారు. వాటిని పరిశీలించిన అనంతరం యూజీసీ న్యాక్ పర్యటనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో తేదీలను ఖరారు చేశారు.

ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా..

ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్ సాధించే దిశగా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే కళాశాలలోని ఇండోర్ స్టేడియంను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. కళాశాల అవసరమైన చోట టైల్స్ వేయిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విగ్రహం ఉన్న ప్రాంతంలోనూ గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నారు. అలాగే కళాశాల ప్రధాన ద్వారం నుంచి లోపలకు వచ్చే దారిని సుందరీకరణ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పటి వరకు ఏ డిగ్రీ కళాశాలకు ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్ కేటాయించలేదు. అయితే కళాశాలలో స్టేట్ హెర్బేరియం, బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. వాటిని పరిగణలోకి తీసుకుంటే మంచి గ్రేడ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పూర్వవిద్యార్థులు కీలకమే..

న్యాక్‌బృందం సందర్శనలో పూర్వవిద్యార్థులు కూడా కీలకమే. బృందంలో వచ్చిన సభ్యులు మొదటిరోజు మధ్యాహ్నం పూర్వవిద్యార్థులతో సమావేశం అవుతారు. 15నిమిషాల నుంచి అరగంట పాటు సమయం కేటాయించి కళాశాల గురించి తెలుసుకుంటారు. పూర్వవిద్యార్థులు ఇచ్చే సమాధానాలకు సంతృప్తి చెందితే మార్కులు వేస్తారు. కళాశాలలో ఇప్పటికే ఓ పర్యాయం సమావేశం నిర్వహించి బృందం పర్యటన గురించి వివరించారు. పూర్వవిద్యార్థుల అసోసియేషన్ కోసం ప్రత్యేక గదిని సైతం కేటాయించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


సిద్ధం అయ్యాం..



న్యాక్ సందర్శన కోసం సిద్ధమయ్యాము. డాటా వెరిఫికేషన్ వాల్యుయేషన్‌లో పొందుపర్చిన డాటా ఆధారంగా యూజీసీ సూచనలు పాటించాం. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సహకారంతో దాదాపు రూ.40లక్షల విలువైన పనులు చేపట్టి పూర్తి చేశాం. ఏడబుల్‌ప్లస్ గ్రేడ్ కోసమే అహర్నిశలు పాటుపడుతున్నాం. తద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

– డాక్టర్ అప్పియాచిన్నమ్మ, ప్రిన్సిపాల్, కళాశాల, జడ్చర్ల

పూర్వ విద్యార్థులు హాజరుకావాలి



న్యాక్ సందర్శనలో భాగంగా ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం పూర్వ విద్యార్థులతో సమావేశం ఉంటుంది. విద్యార్థులు ఎక్కడ ఉన్నా అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరుతున్నాం. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో రూ.25లక్షలతో పెయింటింగ్ పనులు చేయించాం. వస్తు, నగదు రూపేణా మరో రూ.10లక్షల విలువ గల పనులు చేయించాము. ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా మా వంతు సహకారం అందిస్తున్నాం.

– బి.రవిశంకర్, ప్రధాన కార్యదర్శి, పూర్వ విద్యార్థుల అసోసియేషన్

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

MARAM VENKA REDDY INFRA వారు మహబూబ్‌నగర్‌కు అతిసమీపంలో మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత ఫ్రీ రిసార్ట్స్ సౌకర్యంతో 7Hills Sandal Wood Farms అతితక్కువ ధరలకే అమ్మబడును. సం॥ ✆ 7674934559, 9110522090.

0% ఇంట్రెస్ట్ తో 30 నెలల ఈక్వల్ EMI తో రాజాపూర్ దగ్గర అన్ని డెవలప్‌మెంట్స్‌తో 147 గజాలు MUDA (HMDA) లేఅవుట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ ఫోన్ : 9949695027

HOUSE FOR SALE

మహబూబ్‌నగర్ పట్టణంలో రాంనగర్ నందు మూడు కమాన్ జ్యువెల్ సిటీషాపు దగ్గరలో 160 గజాల వెస్ట్‌ఫేస్ ఇల్లు అమ్మకానికి కలదు సంప్రదించవలసిన సెల్ నంబర్: 7995881234.

SERVICES

CHANGE OF NAME

I, Abdul Saleem (Old Name as Recorded in my Adhar Card) R/o H.No: 25-102, Gandhi Nagar, Wanaparthy Town & Dist, T.S. Hereby declare that my actual and Correct name as per my Passport Mohammed Abdul Saleem (New Name) S/o Mohd Abdul Sattar.

ASTROLOGY

ఓం శ్రీ బ్రహ్మ జ్ఞాన జ్యోతిష్య పీఠం.. ఉచిత జ్యోతిష్యం ఖచ్చితమైన పరిష్కారం. 40 సంవత్సరాల అనుభవం ఉన్న విద్వాన్ మహర్షి గారిని సంప్రదించండి.. మీ జాతకం, ఫోటో, విద్య, ఉద్యోగం.. వ్యాపారం.. సంతానం.. స్త్రీ పురుష గుప్త సంబంధం, ఇంట్లో అశాంతి.. మరియు సమస్యల కొరకు. 98 66 29 68 58

WANTED

హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ.18K, ఏజెంట్ కమీషన్ 8K. ఫోన్: 9640258889, 9640468889

Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాలని మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్

అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు..

సోమవారం వరకు అరెస్టు సహా.. ఏ చర్యలూ వద్దన్న తెలంగాణ హైకోర్టు

సీబీఐకి మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అన్ని విచారణ ఫైళ్లను, రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని సీబీఐ దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. విచారణ వివరాలను పెన్‌డ్రైవ్ లేదా హార్డ్ డిస్క్‌లో పూర్తిగా సీల్డ్ కవర్‌లో సోమవారం కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. వివేకా హత్య జరిగిన చోట లభించిన లేఖ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికను కూడా సమర్పించాలని సూచించింది. అప్పటి వరకు అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించింది. పిటిషనర్ (కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి) 14న ఉదయం 11 గంటలకు సీబీఐ ముందు హాజరు కావాలని సూచించింది. ఆయన వెంట న్యాయవాది వెళ్లొచ్చని చెప్పింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై స్టే విధించాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా.. అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున అనిల్ కొంపెల్లి వాదనలు వినిపించారు.

పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..

'వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ 160 కింద జనవరి 24న హాజరు కావాలని ఒకరోజు ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 24న ఎంపీ విచారణకు హాజరయ్యారు. తన విచారణ వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని, విచారణ సమయంలో తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ జనవరి 27న దర్యాప్తు అధికారులకు అవినాశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీన్ని దర్యాప్తు అధికారి అనుమతించలేదు. మళ్లీ ఫిబ్రవరి 24న హాజరు కావాలంటూ ఫిబ్రవరి 16న నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 22న కూడా అవినాశ్‌రెడ్డి వీడియో, ఆడియో రికార్డింగ్‌పై విన్నవించారు. అప్పుడు కూడా అనుమతించలేదు. మరోసారి మార్చి 10న విచారణకు రావాలని మార్చి 5న సీఆర్‌పీసీ 160 కింద మరో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ పారదర్శకంగా సాగడం లేదని, నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు' అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

విచారణ పేరుతో వేధిస్తున్నారు..

'వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు పిటిషనర్ విచారణ ముగియగానే, మీడియా ఇష్టం వచ్చినట్లు కథనాలు రాస్తూ, ఆయన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. వాస్తవాలను పట్టించుకోవడం లేదు. అందువల్లే వీడియో, ఆడియో రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులను ఎంపీ కోరారు. అయినా దర్యాప్తు అధికారి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. విచారణ సమయంలో పిటిషనర్ చెబుతున్న అంశాలను టైపిస్ట్ టైప్ చేస్తుండగా, దర్యాప్తు అధికారి కంప్యూటర్ మౌస్‌ను పలుమార్లు తన చేతుల్లోకి తీసుకుని కొన్ని లైన్లు తీసివేయాలంటూ టైపిస్ట్‌కు సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ దర్యాప్తు అధికారికి, టైపిస్ట్‌కు మాత్రమే కనిపించేలా ఉండటంతో ఏం డిలీట్ చేస్తున్నారో పిటిషనర్ చూడలేకపోయారు. అవినాశ్‌ను విచారణ చేసే సమయంలో నలుగురైదుగురు అధికారులు ఉన్నారు. విచారణ ముగిశాక దీనికి సంబంధించిన ఓ ప్రతిని ఇవ్వమని కోరినా, దర్యాప్తు అధికారి నిరాకరించారు. నిబంధనలు అంగీకరించవని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్ వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలివ్వాలి. ఎఫ్ఐఆర్ సహా ఎక్కడా అవినాశ్ పేరు లేదు. అయినా పలుమార్లు విచారణ పేరుతో వేధిస్తున్నారు. దర్యాప్తు అధికారి.. ముందే ఓ ఊహాజనిత స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని, ఆ మేరకు కావాల్సిన విధంగా సాక్షులను సిద్ధం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డితోపాటు భాస్కర్‌రెడ్డిని కూడా దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. దస్తగిరిని వారికి అనుకూలంగా మలచుకుని, ఆ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు' అని వాదనలు వినిపించారు.

వీడియో రికార్డింగ్‌తోనే విచారణ

వీడియో, ఆడియో రికార్డింగ్‌పై దర్యాప్తు అధికారి వివరణ తీసుకుని కోర్టుకు తెలియజేయాలని న్యాయమూర్తి.. సీబీఐ న్యాయవాదిని ఆదేశించారు.

వివేకా లేఖను తొక్కిపెట్టారు..

'వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను దర్యాప్తు అధికారులు తొక్కిపెడుతున్నారు. వైఎస్ వివేకా అల్లుడే ఆయన్ను హత్య చేశాడని నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే ఈ కేసు అంశాలను మాత్రం సీబీఐ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదు. సీఆర్‌పీసీలో పేర్కొన్న నిబంధనల మేరకు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వీడియో, ఆడియో రికార్డు చేసేలా, న్యాయవాదిని విచారణ సమయంలో అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని పిటిషనర్ న్యాయవాది నివేదించారు.

భోజన విరామం అనంతరం వాదనలు పునః ప్రారంభం కాగా, వీడియో, ఆడియో రికార్డింగ్‌లతోనే పిటిషనర్ విచారణ సాగుతోందని సీబీఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు. వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను ఫోరెన్సిక్‌కు పంపినట్లు చెప్పారు. లేఖ విషయాన్ని 2021 జనవరి 31 నాటి అనుబంధ చార్జీషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అవినాశ్‌రెడ్డి.. సాక్షినా? లేక నిందితుడా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అవినాశ్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు ఇచ్చామని.. అవసరమైతే ఆయన్ను, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని సీబీఐ న్యాయవాది చెప్పారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన సీబీఐ ఎస్పీ.. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్‌డిస్క్, కేసు ఫైళ్లను ఇప్పుడే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. పిటిషన్‌లో తన పేరు ప్రస్తావించినందున తన వాదనలు కూడా వినాలని కోరారు.

దస్తగిరి ఎందుకు రాలేదు?

వైఎస్ వివేకా హత్య కేసులో ఏ–4గా ఉన్న దస్తగిరి విచారణకు ఎందుకు రాలేదని సీబీఐని ప్రత్యేక న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితులంతా హాజరు కావాలని చెప్పాం కదా.. అని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు అందరూ రావాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కూడా హాజరయ్యారు. సీబీఐ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో కొన్ని పేజీలు లేవని, దీంతో దాన్ని తిరిగి పంపించామని న్యాయమూర్తి వెల్లడించారు.

కేసు విచారణను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు. అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఎంపీ అవినాశ్‌రెడ్డి వెంట వచ్చిన 15 మంది మద్దతుదారులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య

- సీబీఐ విచారణ అనంతరం ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి
- హత్యా స్థలి నుంచి లెటర్‌ను మాయం చేశారు
- గుండెపోటని నేను చెప్పలేదు..
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డిది మర్డర్ ఫర్ గెయిన్ (ఆస్తి, సొమ్ము కోసం జరిగిన హత్య) అని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తప్పుదోవలో వెళ్తోందని తాను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానని, అది గూగుల్ టేకౌట్ కాదు టీడీపీ టేకౌట్ అని అన్నారు. తప్పుడు సాక్ష్యాలతో అన్యాయంగా అమాయకులను ఇరికించేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో చాలా కీలక అంశాలను పక్కన పెట్టి, సిల్లీ అంశాలను తెరపైకి తెచ్చి తనకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. సీబీఐ విచారణకు మూడోసారి శుక్రవారం హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వివేకాకు రెండో పెళ్లి.. వారికి ఓ కుమారుడు..

- వివేకం సార్‌కు 2006 నుంచి ఒక యువతితో సంబంధం ఉంది. 2011లో ఆమెను పెళ్లి చేసుకున్నారు. దానికి ఇస్లాం లా ప్రకారం తన పేరు షేక్ మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారు. పెళ్లి తర్వాత వారికి షేక్ షెహన్‌షా అనే అబ్బాయి కూడా పుట్టాడు. ఆ అబ్బాయినే వారసుడిగా ప్రకటించాలనే తపన, ఆలోచన ఆయనలో ఉండింది.
- హత్య జరగడానికి ముందు ఇల్లంతా డాక్యుమెంట్ల కోసం వెతికారని అప్రూవర్ స్టేట్‌మెంట్‌లోనే ఉంది. హత్య తర్వాత కూడా డాక్యుమెంట్లు వెరిఫై చేసుకుని వెళ్లారని చెప్పారు. నా అనుమానం ఏమిటంటే.. నోటరైజ్డ్ విల్లు అది. ఆమె (వివేకా రెండో భార్య) పేరుతోనో, వారి అబ్బాయి పేరుతోనో ఆస్తిని ఇవ్వాలనుకోవడం.. దీన్ని అడ్డుకోవాలనుకోవడం.. ఇందులో ఆసక్తి ఎవరికి ఉందో తెలియాలి.
- నా అనుమానం ప్రకారం ఇది మర్డర్ ఫర్ గెయిన్. అందులో భాగంగానే వాళ్లు వివేకానందరెడ్డి గారిని ఇలా చేశారు. రాబోయే రోజుల్లోనూ న్యాయ పోరాటం చేస్తా.

ఆ లేఖ ఎందుకు దాచారు?

- నేను గాలి మాటలు మాట్లాడట్లేదు. సొంత కవిత్వాలు చెప్పట్లేదు. రికార్డుల్లో ఉన్నవి, వాటి ద్వారా తెలిసినవే మాట్లాడుతున్నా. నేను వెళ్లే లోపలే సీన్ ఆఫ్ క్రైమ్‌లో ఉన్న లేఖను సునీతమ్మ భర్త రాజశేఖర్ దాచి పెట్టారు. పీఏ కృష్ణారెడ్డికి ఆ లెటర్ విషయం కానీ, అందులో ఉన్న అంశాలు కానీ ఎవరికీ చెప్పొద్దని చెప్పారు. దీంతో పాటు సెల్ ఫోన్‌ను దాచిపెట్టడం తప్పు కాదా?
- నన్ను వెళ్లమని చెప్తేనే అక్కడకు వెళ్లాను. లెటర్ ఉన్న విషయం నాకు కూడా చెప్పలేదు. ఆ లెటర్ చాలా కీలక ఆధారం. సరైన సమయానికి దాని విషయం బయటకు చెప్పకపోవడం ఈ కేసులో పెద్ద తప్పు.
- నేను ఏ ఒక్కరికీ గుండెపోటని (వివేకా మరణానికి కారణం) చెప్పలేదు. కావాలంటే ఆ రోజు మార్చురీ దగ్గర, మార్చ్ 17న మాట్లాడిన మాటలు చూడండి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నేను అలా చెప్పినట్లు చిత్రీకరించింది.
- నేను చూసి బయటకు వచ్చి పోలీసులు, కుటుంబీకులు, దగ్గర బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పా. ఇవన్నీ చేయకుంటే తప్పంటారనుకున్నా. చేస్తే తప్పంటారని ఊహించలేదు.

ముమ్మాటికీ అది కట్టుకథే

- అప్రూవర్ థీయరీనే ఓ కట్టుకథ. ప్రారంభంలోనే గొడవ ప్రస్తావన. రూ.8 కోట్ల డబ్బు రావాల్సి ఉందో, వచ్చిందో వాటి గురించి గొడవ మొదలైందని చెప్తారు. ఆ షేర్ల పంపకం మీద వివేకం సారేమో మొత్తం నాకే కావాలని అన్నట్లు, వీళ్లేమో నువ్వు సగం తీసుకో, నేను సగం తీసుకుంటా అన్నట్లు గొడవ మొదలై ఉండొచ్చంటారు.
- ఇదే సీబీఐ విచారణలో ఆ బెంగళూరు సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఎనిమిది మంది సాక్షులు (ఎల్‌డబ్ల్యూ 10 నుంచి మొదలై) చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది.. ఒక్క రూపాయి డబ్బు కూడా వచ్చే అవకాశం లేదు.. ఆ డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ అని చెప్తారు. అంటే రాని, వచ్చే అవకాశమే లేని డబ్బు కోసం ఎవరైనా గొడవ పెట్టుకుని కొట్టి చంపుకుంటారా? ఇది కట్టు కథ అనడానికి ఇది చాలదా?

ఇది కుమ్మక్కు కాదా?

- సుప్రీంకోర్టులో మా సోదరి (సునీత) వైల్డ్ అలిగేషన్స్‌తో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను సమర్థిస్తూ సీబీఐ వాళ్లు కౌంటర్ అఫిడవిట్ వేస్తారు.

అందుకే నోరు విప్పాల్సి వస్తోంది..

- కేవలం కుట్రలకు ఉపయోగపడే వాంగ్మూలాలు తప్ప నిజాలను వెల్లడించే వాంగ్మూలాలు తీసుకోవట్లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను సరిగ్గా మద్దతు ఇవ్వలేదని ప్రచారం చేశారు. అభియోగాలు మోపారు. దాదాపు 800 పైచిలుకు ఎమ్మెల్సీ ఓటర్లు.. ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు. వారిని పిలిచి అడగండి. అదీ చేయరు. అప్రూవర్ థియరీ.. కట్టుకథను అడ్డం పెట్టుకుని విచారణను ఓ వ్యక్తి టార్గెట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు.
- దీన్ని ఎవరూ హర్షించరు. దీంతో గళమెత్తడం మొదలుపెట్టాం. ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు వచ్చినా, మీడియా ఎన్ని విమర్శలు చేసినా, మా సోదరి సునీతమ్మ సుప్రీంకోర్టులో, ఆంధ్ర హైకోర్టులో నాపై ఎన్ని ఆరోపణలు చేసినా మౌనంగానే ఉన్నా. ఎందుకంటే వివేకం సార్ చనిపోయారు.. ఈమె ఆయన కూతురు అని.. విచారణ జరుగుతున్నప్పుడు విచారణ సంస్థపై నమ్మకం ఉండాలని మౌనంగా ఉన్నాను. అయితే విచారణ తప్పుడుదోవలో వెళ్తోందని స్పష్టం కావడంతో నోరు విప్పుతున్నాను. నేను ఎటువంటి తప్పు చేయలేదని ప్రతి ఒక్కరికీ గట్టిగా చెబుతున్నా.

గురువారం లంచ్ మోషన్ మూవ్ చేస్తూ రెస్పాండెంట్స్‌గా సీబీఐ డైరెక్టర్, దర్యాప్తు అధికారిని పెట్టాం. మధ్యాహ్నం 2 గంటల కల్లా సీబీఐ వారి కంటే ముందు మా సోదరి తరఫు అడ్వకేట్లు వచ్చారు. అంటే వారికి ఎవరు సమాచారం ఇచ్చారు?

- సీబీఐ వాళ్లకు నోటీసు వచ్చిన వెంటనే చిటికలో సమాచారం ఇస్తున్నారు. ఆ రోజు సుప్రీంకోర్టులో కుమ్మక్కై పిటిషనర్‌కు అనుకూలంగా కౌంటర్ వేసి కోర్టులను తప్పుదోవ పట్టించారు. లంచ్ మోషన్‌లోనూ ఆమెకు సమాచారం ఇచ్చి ఇంప్లీడ్ చేయిస్తున్నారు. ఇది కుమ్మక్కు కాదా? దీని వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయి. ఈ రాజకీయ కుట్రలను తప్పకుండా ఛేదిస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. కంచే చేను మేస్తే.. సీబీఐ ఈ రకంగా కుమ్మక్కై విచారణ చేస్తే మాకు ఎవరు దిక్కు?.

తప్పుదోవలో విచారణ

- ఉదయం 10.40–10.45 గంటల మధ్య ఇక్కడికి వచ్చాను. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారించారు. ఆ తర్వాత కోర్టు నుంచి పిలుపు వచ్చిందని దర్యాప్తు అధికారి వెళ్లారు. అయినప్పటికీ 3.30 గంటల వరకు అక్కడే కూర్చోమన్నారు. ఆపై సీబీఐ వాళ్లు వచ్చి మీరు వెళ్లండి.. మళ్లీ మేము పిలిచినప్పుడు రండని చెప్పారు.
- విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలని దర్యాప్తు అధికారిని మొదటి నుంచీ అడుగుతూనే ఉన్నాం. రెండోసారి ఇదే అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌నే అడిగాం. ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మూడోసారి హైకోర్టును ఆశ్రయించాం. విచారణ తప్పుదోవలో వెళ్తుండటంతో ఇలా చేయక తప్పలేదు.
- ఎంపీ టిక్కెట్టే ఈ హత్యకు కారణం అంటే మా జిల్లా వాళ్లు నవ్వుతారు. వివేకం సర్ చనిపోయే రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలంలో దాదాపు 300 ఇళ్లు డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డికి.. ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌కు ఓటెయ్యండని ప్రచారం చేశారు. కావాలంటే ఆ ఇళ్లకు వెళ్లి అడగచ్చు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అడగచ్చు.. వాంగ్మూలం తీసుకోవచ్చు. కానీ వీళ్లు (సీబీఐ) అలా అడగరు. వాంగ్మూలం తీసుకోరు.

పునరావాస పనులు వేగవంతం

- కలెక్టర్ రవినాయక్
- అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పునరావాస పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో పాలమూరు ఎత్తిపోతల పథకం కింద ఆర్‌అండ్‌ఆర్ పనులతో పాటు భూసేకరణపై ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జూన్ లోపు భూ సేకరణ పూర్తి చేసి చివరి దశకు తీసుకురావాలన్నారు. ముంపునకు గురవుతున్న 7 గ్రామాలకు సంబంధించి పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సీసీఎల్ఏ డైరెక్టర్ రూపస్ దత్తం మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌ఆర్ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎక్కడైనా అవార్డు పాస్ చేయాల్సి ఉంటే కచ్చితంగా చేయాలన్నారు. సమీక్షలో అడిషనల్ కలెక్టర్ సీతారామారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువు తయారు చేయండి

సెగ్రిగేషన్ షెడ్లలో తప్పనిసరిగా కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు ఇది వరకే నిర్దేశించిన విధంగా స్థలాలను గుర్తించి పూర్తి చేయాలన్నారు. పంచాయతీలో కార్యదర్శులు సకాలంలో గ్రామాలలో హాజరై పారిశుద్ధ్యం, ఇతర పనులు చూడాలన్నారు. ఆయా గ్రామాలలో ఇప్పటి వరకు చేపట్టిన పనులు ఇంకా మిగిలిపోయిన పనులపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంపు, హరితహారం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ యాదయ్య, జెడ్పీ సీఈఓ జ్యోతి, జకీయాసుల్తానా, డీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు నిర్మూలించాలి

మాతా శిశు మరణాలు నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలు కాకుండా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయిన తర్వాత 3 నెలల వరకు పూర్తి స్థాయిలో పరీక్షలు చేస్తూ జాగ్రత్తలు తీసుకునేలా వారిని చైతన్యం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతి నెల తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవడమే కాకుండా తప్పనిసరిగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్, టీకాలు, మందులు అందించాలన్నారు. రిస్క్ ఎక్కువగా ఉన్న కేసుల విషయంలో భర్త, తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నటరాజు, జిల్లా సంక్షేమాధికారి జరినాబేగం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



రాజాపూర్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ప్రేమావతి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రూ.3లక్షలలోపు ఆదాయం మించని వారు న్యాయ సేవాధికార సంస్థ సేవలు వినియోగించుకోవచ్చన్నారు. వివిధ రకాల కేసులను వాదించడంలో నిపుణులైన న్యాయవాదుల జాబితాను తయారు చేసి వారి సేవలకుగాను అవసరమైన ఖర్చులు, రుసుము న్యాయ సేవా నిధి నుంచి చెల్లిస్తారన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా యునివర్సిటీలో విద్యార్థులందరికీ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. లా విద్యను అభ్యసించే విద్యార్థులు లీగల్ సర్వీసెస్ అందించడంలో ముఖ్య పాత్రపోషించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, సంధ్యారాణి, ఎస్ఎంఐఎంఎస్ డైరెక్టర్ సిద్ధార్థ గోష్, రవికుమార్ యాదవ్, సతీష్‌కుమార్ కుల్‌కర్ణి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో ఎమ్మెల్యేకు అవకాశం

గద్వాల రూరల్: దక్షిణ మధ్య రైల్వే శాఖలో డివిజనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సభ్యుడిగా నియమించారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే శాఖ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

2వేల కార్ల విక్రయాలు

పాలమూరు: ఈ ఆర్థిక సంవత్సరం (2022–23)లో రెండు వేల మారుతీ కార్లు విక్రయించి రికార్డు నెలకొల్పినట్లు శ్రీరామ–జయరామ ఎండీ బెక్కరి రాంరెడ్డి వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని మారుతీ షోరూంలో శుక్రవారం 2వేల కార్లు విక్రయించిన నేపథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. 11 నెలల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో ఈ విక్రయాలు నిర్వహించినట్లు తెలిపారు. 2012 నాటి నుంచి ఇప్పటి వరకు కస్టమర్లకు పూర్తిగా నమ్మకంతో విక్రయాలు పెంచుతూ వస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈఓ విక్రమ్, షోరూం మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, తుకారాం, నవీన్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం

- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ధర్నా



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించిందని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రం న్యూటౌన్ ఎస్‌బీఐ ఎదుట శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఎస్‌బీఐ వరకు చేరి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ ఆర్థిక అవకతవకలపై జేపీసీ విచారణ చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వరంగ సంస్థలను అదానీకి ధారాదత్తం చేస్తున్నట్లు ఆరోపించారు. అతిపెద్ద కార్పొరేట్ స్కాంకు పాల్పడ్డ అదానీని సీబీఐ, ఈడీ, సెబీ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అదానీ గ్రూప్ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై ఎక్కడికక్కడ ప్రజలు నిరసన తెలపాల్సిన అవసరం ఉందన్నారు. అదానీ గ్రూప్‌లో మారిషస్ పెట్టుబడులపై సెబీ విచారణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం అదానీ కోసం నిబంధనలను పక్కనపెట్టి ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టుపెడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నిరసనలో ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్, సీజే బెనహర్, లక్ష్మణ్ యాదవ్, సాయిబాబా, సిరాజ్ ఖాద్రీ, శ్రీనివాస్‌గౌడ్, పీర్ మహ్మద్, అవేజ్, చంద్రశేఖర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ (కో–ఎడ్) కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్యం –1, కంప్యూటర్స్–1, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం–1, ఆత్మకూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం–1, వాణిజ్యం–1 ఖాళీలు ఉన్నాయని.. పీజీలో ఆయా సబ్జెక్టుల్లో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, పీహెచ్‌డీ, నెట్/సెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల వారు 16వ తేదీ సాయంత్రం 5లోపు ఆయా కళాశాలల్లో దరఖాస్తులు అందజేయాలని, 17న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ కో–ఎడ్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

రుణాలు చెల్లించకుంటే భూముల వేలం

గ్రామాల్లో డీసీసీబీ అధికారుల చాటింపు

ఆత్మకూర్: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించని రైతుల భూములను వేలం వేస్తామని డీసీసీబీ ఆత్మకూర్‌శాఖ అధికారులు శుక్రవారం గ్రామాల్లో చాటింపు వేయించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ గోపాల్ మాట్లాడుతూ.. ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాల పరిధిలోని గ్రామాల రైతులు ఏళ్ల క్రితం తీసుకున్న రుణాలు చెల్లించడం లేదని, ఇదివరకే పలుమార్లు నోటీసులు ఇవ్వడంతో పాటు తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల్లో బహిర్గతం చేయడం, గ్రామాల్లో చాటింపు వేయించామన్నారు. తీసుకున్న రుణాలు ఈ నెల 26లోపు చెల్లించకపోతే 27న భూముల వేలం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రఘు, సురేష్, మాసన్న, రవి, ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.



మూలమళ్లలో చాటింపు వేయిస్తున్న బ్యాంకు అధికారులు

ఆరోగ్య సేవలపై కేంద్ర బృందం పరిశీలన



ఆస్పత్రిలో కేసీఆర్ కిట్ అందజేస్తున్న కేంద్ర బృందం

గట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర బృందం (ఎన్‌కాస్ టీం) ఇందుమతిపాటిల్, అబ్బాస్‌అహ్మద్ సందర్శించారు. జాతీయ స్థాయి ప్రమాణాల మేరకు రోగులకు అందజేస్తున్న వివిధ రకాల ఆరోగ్య సేవల గురించి ఆరా తీశారు. కేంద్రం పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందజేస్తున్న మందుల వివరాలను, ప్రజలతో సిబ్బంది ఏ విధంగా సంబంధాలను కలిగి ఉన్నారనే దానిపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ, ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రసవాల్లో రాష్ట్ర స్థాయిలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునే విధంగా గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను ఏ విధంగా చైతన్యవంతుల్ని చేస్తున్నారనే విషయాలను సభ్యులు ఏఎస్ఎం, ఆశా వర్కర్లు ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, రాజు, సీహెచ్ఓ హుస్సేని, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు




చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. స్వామి వారికి ఉదయం ప్రాతరాధినాది, మహాపూర్ణాహుతి నిర్వహించి చక్రతీర్థ–రాజభోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం పుష్పయాగం, సాయంత్రం దేవతోద్వాసనం, ద్వాదశారాధన ముగింపు కార్యక్రమాలను భక్తులు తిలకించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అంగరంగ వైభవంగా విగ్రహాలకు చక్రతీర్థ స్నానం, అభిషేకాలు, అలంకరాలు చేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు దేవస్థానం సమీపంలో రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కనున్న లక్ష్మీనరసింహ(ఓబులేశు) స్వామివారి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలివేలు మంగతాయారు ఉత్సవాలు ముగిసిన తర్వాత స్వామివారి ఉత్సవాన్ని ఒకరోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఇక్కడ కూడా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో తిరుమంజనం, మహానివేదన, సహస్రనామార్చన, నక్షత్ర హారతి, మహాదాశీర్వాదం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



హారతి ఇస్తున్న ఆలయ ధర్మకర్త అళహరి రామకృష్ణ